
# ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలం

**'కాసాని'కి ఓటు.. బీసీల విజయానికి తొలిమెట్టు**

**బీసీల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాన్ని నిజం చేద్దామంటున్న బీసీ సంఘాలు**



కాంగ్రెస్‌కు విభజించడం, పాలించడం అలవాటైందని బీసీ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే బీసీలు అణచివేతతోపాటు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతామని హెచ్చరిస్తున్నారు. బీసీకి చెందిన వ్యక్తి పార్లమెంటులో ఉంటేనే నిధులు, విధుల గురించి పోరాటం చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు రాని అవకాశం చేవెళ్లలో బీసీలకు వచ్చిందని, బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని స్పష్టం చేస్తున్నారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాన్ని కాసాని గెలుపుతోనే నిజం చేద్దామని పిలుపునిస్తున్నారు. కాసానికి వేసే ప్రతి ఓటు బీసీల విజయానికి తొలిమెట్టుగా భావించాలని, కాసాని గెలిస్తే పార్లమెంటులో బీసీల ప్రాతినిథ్యం కూడా పెరుగుతుందని వివరిస్తున్నారు. బీసీల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి రావాలని, బీసీల పట్ల చులకన భావంతో మాట్లాడుతున్న నేతల నోళ్లకు చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఫలితంతో తాళం వేయాలని కోరుతున్నారు. **రంగారెడ్డి, మే 7 (నమస్తే తెలంగాణ)**

### అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోం



మన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోం. అగ్రవర్గాల రాజకీయ నాయకులను గతంలో గెలిపించుకుంటే వారి వల్ల బీసీలకు ఎలాంటి లాభం జరుగలేదు. కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీ అందించి బీసీల సత్తా చాటుదాం. బీసీ నేతను గెలిపించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రావు.

**- గొల్ల గోరెప్ప, హాజీపూర్, యాలాల మండలం**

### చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యత చాటుతాం



మన బీసీల గొంతుకను లోక్‌సభలో వినిపిద్దాం. ఈ గొప్ప అవకాశాన్ని చేజార్చుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. బీసీలకు బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. బీసీలు ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాజకీయాలను అందరం పక్కన పెట్టి పార్టీల కతీతంగా కాసాని గెలుపునకు కృషి చేద్దాం.

**- ఈడిగి నర్సింహులు, హాజీపూర్, యాలాల మండలం**

### బీసీ నేతను గెలిపించుకుందాం



బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంచి పట్టున్న నేత. జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీగా పనిచేసిన నాయకుడు కాసానికి బీఆర్ఎస్ అధినేత చేవెళ్ల ఎంపీ టికెట్ కేటాయించడం గొప్ప పరిణామం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలందరం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- శేరిగూడెం వెంకటయ్య, నాగరకుంట(షాబాద్)**

### బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి



చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు అందరూ కృషి చేయాలి. గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీలుగా గెలిచిన ఇద్దరు నాయకులు సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. బీసీ నేత కాసానికి ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ అవకాశం కల్పించారు. బీసీ సోదరులంతా ఒకసారి ఆలోచించి, జ్ఞానేశ్వర్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- సాయికిరణ్‌గౌడ్, చందనవెల్లి(షాబాద్)**

### పేదలకు, ఉన్నతులకు మధ్య యుద్ధం



సమాజంలో నెలకొన్న అసమానతలు పూర్తిగా సమసిపోవాలని పోరాడుతున్నా. ఇంకా కొందరు వాటిని కొనసాగించి రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. జనాభాలో తగు సంఖ్య ఉన్నప్పటికీ ఇప్పటికీ బీసీ వర్గాలు ప్రధానంగా రాజకీయంగా వెనుకబాటులోనే ఉంటున్నారు. ఈ వర్గాన్ని గుర్తించి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీసీ బిడ్డకు ఇచ్చి కేసీఆర్ వారి పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. **- పద్మ ముదిరాజ్, ఎల్లమ్మబండ**

### నిలబడతాం.. నిలబెట్టుకుంటాం..



ఏండ్ల తరబడి రాజకీయ నేతలకు ఓటు బ్యాంకుగానే తప్ప వెనుకబడిన వర్గాలు వారి కంటికి కనబడే పరిస్థితి లేదు. అందుకు మా వర్గానికి చెందిన కాసానికి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని ఇచ్చిన బీఆర్ఎస్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం. బీసీ బిడ్డలంతా ఈ ఎన్నికల్లో ఐక్యంగా నిలబడమే కాకుండా మా అభ్యర్థిని విజయ తీరాలపై నిలబెట్టుకుంటాం. **- వెన్నెల ముదిరాజ్, ప్రశాంత్‌నగర్**

### బీసీలంతా ఏకతాటిపైకి రావాలి



బీసీలు చైతన్యం చాటే సమయం ఆసన్నమైంది. ఓట్లు మావే, గెలుపు మనదే. రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తెచ్చిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. బీసీల గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరమున్నది. కాంగ్రెస్ శ్రేణులు అహంకారపూరితంగా చేస్తున్న వ్యాఖ్యలకు మన ఐక్యతే చెంపపెట్టు కావాలి. **- పబ్బు శేఖర్**

### కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



బీఆర్ఎస్ నాయకులు పోటీ చేస్తున్న ప్రతి చోట పార్టీలకు అతీతంగా వారిని గెలిపించుకుందాం. బీసీలను అవమానపర్చేలా మాట్లాడుతున్న అగ్రవర్గ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి. బీసీలోని 96 కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం వైపు నడవాలి. మన ఓట్లు మనకే అనే నినాదంతో ముందుకెళ్లాలి. జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ టికెట్ ఇవ్వడం సంతోషించదగ్గ విషయం.

**- కానుగుల బాలుశ్రీ**

### బీసీ అభ్యర్థిని గెలిపించుకుందాం



ఏన్నో ఏండ్లుగా బీసీలను ఓట్లు కాసే చెట్లుగా మార్చుకున్నారు తప్ప బీసీలకు ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు బీసీల్లో చైతన్యం వచ్చింది. మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేదిలేదు. **- శ్రీనివాస్, మోమిన్‌కలాన్, ధారూరు మండలం**

### బీసీ బిడ్డను పార్లమెంటుకు పంపిద్దాం



తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ బలపరచిన చేవేళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంటుకు పంపిద్దాం. అగ్రవర్గాలు బడుగు బలహీన వర్గాలను అణగదొక్కుతూ రాజకీయాల్లో అవకాశం కల్పించడంలేదు. బీసీల ఓట్లతో ఎంతో మంది రాజ్యాధికారం చేపట్టారు. బరిలో నిలుచున్న జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. **- పెంటయ్య, మోమిన్‌కలాన్, ధారూరు మండలం**

### చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం



బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషిచేసిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అఖండ మెజార్టీతో చేవెళ్ల గడ్డపై గెలిపించుకుంటాం. ఇన్నాళ్లు అగ్రవర్గాలకు చెందిన నాయకులకే అన్ని రాజకీయ పార్టీలు టికెట్‌ను కేటాయించి బీసీలను బానిసల్లా అణగదొక్కారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో మొదటిసారి బీసీ నేత జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇచ్చారు.

**-షేక్ ముక్తార్ పాషా**

### సవాల్‌గా తీసుకోవాలి



బీసీల ఐక్యతకు చేవెళ్ల పార్లమెంటు సీటును ఓ సవాల్‌గా ప్రతి బీసీ నాయకుడు, ప్రజలు తీసుకోవాలి. అందరూ కలిసికట్టుగా మన ఐక్యతను చాటుకుని ఓ బీసీ నేతను పార్లమెంటుకు పంపితే మన సమస్యలపై అక్కడ గొంతెత్తే అవకాశం ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సైతం అంతర్గతంగా ఆలోచించి కాసానిని గెలిపించుకునేందుకు ఏకతాటిపైకి రావాలి.

**- బుద్దోలు శ్రీరాములు కురుమ, మణికొండ**

### కాసానికి అవకాశం కల్పించడం సరైనదే.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడే కాసాని జ్ఞానేశ్వర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 30 సంవత్సరాల క్రితం 96 కులాలను ఏకంచేసి రాజకీయ చైతన్యం కల్పించారు. కాసాని చైర్మన్‌గా ఉండి వేసిన ఫార్మేషన్ రోడ్లు నేటికీ ఈ ప్రాంతంలో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం చేవెళ్ల ఎంపీ స్థానానికి కాసానికి కేసీఆర్ అవకాశం కల్పించడం సరైనదే.

**- సతీష్, పూడూరు**

### బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు



బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయింది. ప్రస్తుతం రైతులు, యువకులు, వృద్ధులు కాంగ్రెస్, బీజేపీలను నమ్మడం లేదు. గతంలో బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పేదల సంక్షేమమే ధ్యేయంగా జ్ఞానేశ్వర్ పనిచేశారు. కాసాని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మంచి పేరున్న నాయకుడు.

**- మధుసూదన్, పూడూరు**

# చేవెళ్ల గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే..

**కేటీఆర్ రోడ్ షో సక్సెస్‌తో ఫుల్ జోస్‌లో బీఆర్ఎస్ శ్రేణులు**



శంషాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించిన కేటీఆర్ రోడ్‌షోకు తరలివచ్చి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు

శంషాబాద్ రూరల్, మే 7 : బీసీ నినాదంతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం శంషాబాద్ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేటీఆర్ రోడ్‌షో సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఫుల్‌జోస్‌లో ఉన్నారు. కేటీఆర్ రోడ్‌షోకు వేలాదిగా నాయకులు, ప్రజలు తరలిరావడంతో కేటీఆర్‌సైతం ప్రశంసల జల్లు కురిపించడంతో రెటింపు ఉత్సాహంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. చేవెళ్లగడ్డపై మరోసారి బీఆర్ఎస్ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు 2009లో ఏర్పడిన చేవెళ్ల పార్లమెంట్‌లో దివంగత కేంద్రమాజీ మంత్రి జైపాల్‌రెడ్డి గెలుపొందారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి 4,35,077ఓట్లతో 33.1శాతంతో గెలుపొందారు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి 5,28,148 ఓట్లతో 40.62 శాతంతో గెలుపొందారు. 2024లో సైతం బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపిస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామని దీమాతో ఉన్నారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు బీసీ నినాదంతో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో సోమవారం శేరిలింగంపల్లి, శంషాబాద్, బడంగ్‌పేట్‌లలో కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలే ఇందుకు నిదర్శనమని వివరిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురవేస్తామని దీమాతో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

# లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ అజీజ్‌పాషా

హిమాయత్‌నగర్, మే 7: సమాజంలోని మైనార్టీ వర్గాల మధ్య విభేదాలు సృష్టించి బీజేపీ విద్వేషజ్వాలలను రగిలిస్తుందని, ఇది దేశానికి చాలా ప్రమాదకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా ఆరోపించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో అఖిల భారత తంజీమ్–ఏ ఇన్సాఫ్ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో 10ఏండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసింది ఏమి లేదని, ప్రజల మధ్య చిచ్చుపెడుతూ శాంతికి భగ్నం కల్గిస్తుందన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటీ నరసింహ, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.




# అత్తాపూర్‌లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం..



అత్తాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి, తదితరులు

అత్తాపూర్, మే 7: చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా మూడవసారి రెపరెపలాడడం ఖాయమని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో చేవెళ్ల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ లభించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, వారి సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో శివకుమార్, సంతోశ్, నాగేశ్, గురుముఖసింగ్, జైహింద్‌రెడ్డి, నర్సింహా, మహేశ్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు బంగా శ్రీనివాస్, యాదయ్య, భరత్‌సారంగి, రవిగౌడ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

# పజ్జన్నకు మద్దతుగా విస్తృత ప్రచారం..



బంజారాహిల్స్ డివిజన్‌లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్రనేత విప్లవ్‌కుమార్, నాయకులు

బంజారాహిల్స్,మే 7: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌ను గెలిపించాలంటూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో బూత్‌స్థాయి కార్యకర్తలతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్రనేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. బంజారాహిల్స్ డివిజన్‌కు ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్‌నేత విప్లవ్‌కుమార్ పలు బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పార్టీతప్ప వేరే పార్టీ వల్ల పేదలకు ఉపయోగం లేదని పలువురు ఓటర్లు చెప్పడం విశేషం. ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పద్మారావుగౌడ్ గెలుస్తారని విప్లవ్‌కుమార్ దీమా వ్యక్తం చేశారు.

**వెంకటేశ్వరకాలనీలో..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంకటేశ్వరకాలనీ డివిజన్, దేవరకొండ బస్తీలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి చేపట్టిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. ఎక్కడకు వెళ్లినా మహిళలు కార్పొరేటర్‌ను ఇంట్లోకి ఆహ్వానించి తమ ఓటు కారు గుర్తుకే అంటూ భరోసా ఇచ్చారు. ఎవరెన్ని చెప్పినా గెలిచేది కేసీఆర్ మాత్రమే అని ప్రచారంలో లభిస్తున్న స్పందన ద్వారా అర్థం అవుతోందని పేర్కొన్నారు.

**బోరబండ డివిజన్‌లో..**

ఎర్రగడ్డ, మే 7: సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా మంగళవారం బోరబండ డివిజన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సూచన మేరకు బూత్‌ల వారీగా మొత్తం 20 బస్తీల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మైనార్టీలు అధిక సంఖ్యలో ఉండే స్వరాజ్‌నగర్‌లో నిర్వహించిన ప్రచారంలో స్థానికులందరూ పజ్జన్నకు మద్దతుగా కారు గుర్తుకు ఓటేస్తామని చెప్పడం విశేషం. స్వరాజ్‌నగర్ అధ్యక్షుడు ఎంప అహ్మద్, పార్టీ నాయకులు ఖయ్యూం, మజహర్‌అలీ, గౌస్, అష్రఫ్, షఫీ, రహ్మత్, అబ్దుల్లా, సందానీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే.. వినాయకరావునగర్‌లో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్ నేతృత్వంలో ఇంటింటి ప్రచారం నిర్వహించగా మంచి స్పందన లభించింది. నేతలు ఆనంద్, గోగుల్ల వెంకటేశ్, లడ్డు, సంతోషి, ముక్కా నర్సింగ్, భరత్, యశ్వంత్ ప్రచారంలో పాల్గొన్నారు.



స్వరాజ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అహ్మద్ తదితరులు



వినాయకరావునగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కృష్ణమోహన్, పార్టీ నేతలు

**అమలుకాని ఆరు గ్యారంటీలు ...**

హిమాయత్‌నగర్, మే 7: ఆచరణలో అమలుకాని ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని మభ్యపెడుతుందని మాజీ కార్పొరేటర్ జె.హేమలతయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత బాబు యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం హిమాయత్‌నగర్, నారాయణగూడలలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్, కృష్ణయాదవ్, ఐలమ్మ, యాదగిరి, రామకృష్ణ, ఫసీయుద్దీన్, బాబు, సయ్యద్ బిన్ ఖార్వన్, సయ్యద్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ కవితారెడ్డి, తదితరులు



హిమాయత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న హేమలతయాదవ్, నాయకులు



నారాయణగూడలో కరపత్రాలను పంచుతున్న కొల్కుల శ్రీకాంత్ , తదితరులు

### ఆర్థిక లావాదేవీలతోనే హత్య

### నిందుతుడి రిమాండ్


బండ్లగూడ, మే 7: హత్య కేసును అత్తాపూర్ పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించి నిందితుడిని అరెస్టు చేశారు. మంగళవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకటరామి రెడ్డితో కలిసి రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన మక్బుల్, అంజాద్‌ఖాన్, అబ్రార్ షరీఫ్, మనోజ్‌లు స్నేహితులు. వీరందరు రియల్ వ్యాపారం చేస్తున్నారు. కాగా.. రియల్ వ్యాపారంలో అంజాద్‌ఖాన్‌కు మిగతా ముగ్గురు డబ్బులు ఇవ్వలేదు. దీంతో కక్ష పెంచుకున్న అంజాద్‌ఖాన్ .. ఈ నెల 4న కాంగ్రెస్ పార్టీ మీటింగ్ వద్ద ఉన్న మక్బుల్, మనోజ్, అబ్రార్‌షరీఫ్‌లపై కత్తితో దాడిచేయగా మక్బుల్‌కు, మనోజ్‌లకు గాయాలయ్యాయి. ఈ ఇద్దరిని స్థానికులు అస్పత్రికి తరలించగా మక్బుల్ అప్పటికే మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు అంజాద్‌ఖాన్‌ను పూనేలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### బాస్కెట్‌బాల్ చాంప్ ఫీచర్‌కిడ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జూబ్లీహిల్స్ అపోలో గ్రౌండ్‌లో జరిగిన బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఫీచర్‌కిడ్స్ స్కూల్ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన బాలుర అండర్–17 విభాగం ఫైనల్లో ఫీచర్‌కిడ్స్ 17–16తో పుష్పన్ స్పోర్ట్స్ అకాడమీపై అద్భుత విజయం సాధించింది. మరోవైపు బాలికల తుదిపోరులో ఫీచర్‌కిడ్స్ స్కూల్ 24–18తో పుష్పన్ స్పోర్ట్స్ అకాడమీపై విజయం సాధించింది. టోర్నీలో మొత్తం అన్ని విభాగాల్లో కలిపి54 జట్లు పోటీపడ్డాయి. కోచ్ సంతోష్,అంథోనీరెడ్డి హాజరయ్యారు.

# భారీ వర్షం.. అతలాకుతలం

**విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. పలు ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్.. రాకపోకలకు అంతరాయం**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో భారీగా కురుస్తున్న వర్షం



అమీర్‌పేట్ రహదారిపై నిలిచిన వర్షం నీరు

బంజారాహిల్స్/జూబ్లీహిల్స్/వెంగళరావునగర్, మణికొండ, మే 7: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ , రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలో భారీ వర్షంతో పాటు పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రారంభమయిన వర్షం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగడంతో పాటు వేగంతో గాలులు వీయడంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కృష్ణానగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, సోమాజిగూడ, యూసుఫ్ గూడ, బోరబండ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ డివిజన్లలో, మణికొండ మున్సిపాలిటీ , పంచవటి కాలనీ ప్రధాన రహదారిపై, తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. పలు రహదారులు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల కరెంట్ వైర్లు తెగిపడ్డాయి. షాపుల ముందు ఉంచిన హోర్డింగ్‌లు, బోర్డులు గాల్లోకి ఎగిరాయి. రోడ్లపై వెళ్తున్న వాహనదారులు తమ కళ్లముందే చెట్లు నేలకూలుతుండటంతో తీవ్ర భయాందోళనలకులోనయ్యారు. ప్రధాన రహదారుల్లో భారీగా వర్షపునీరు ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జూబ్లీహిల్స్ నుంచి పంజాగుట్ట ప్రధాన రహదారిపై పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అమీర్‌పేట ప్రాంతంలో నిలిచిన వర్షపు నీరు కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు, మాన్‌సూన్, ఐఆర్‌టీ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు.

### 'మోత్కుపల్లి కాదు.. ఊసరవెళ్లి'

జూబ్లీహిల్స్, మే 7 : మాజీ మంత్రి మోత్కుపల్లి తన ఇంటిపేరును 'ఊసరవెళ్లి'గా మార్చుకుంటే బాగుంటుందని కాంగ్రెస్ నాయకుడు డి.శ్రీశైలం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మోత్కుపల్లిపై నిప్పులు చెరిగారు. రెండు రోజుల క్రితం డి.శ్రీశైలం తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసి ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. కాగా మోత్కుపల్లి ఇటీవల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డిని దుర్భాషలాడుతూ చేసిన వ్యాఖ్యలపై శ్రీశైలం అభ్యంతరం వ్యక్తం చేశారు.

### బీజేపీ ధర్నా..

ఎర్రగడ్డ, మే 7: తమ పార్టీ తరపున ప్రచారం చేస్తున్న కార్యకర్తలను అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారంటూ బీజేపీ బోరబండ పీఎస్ వద్ద ధర్నాకు ది గింది. బోరబండ డివిజన్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు వీకర్‌సెక్షన్‌లో మంగళవారం రాత్రి ప్రచారం నిర్వహిస్తున్నారు. అటుగా వచ్చిన పోలీసులు నలుగురు బీజేపీ కార్యకర్తలను పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్ సహా పలువురు పీఎస్ వద్ద ధర్నాచేసి..పోలీసులతో వాగ్వాదా నికి దిగారు. ఈక్రమంలో వెంకటేశ్‌కు గాయాలయ్యా యి. ఈ ఘటనపై బీజేపీ నేతలు డీసీపీకి ఫిర్యాదు చేశారు.

